## ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# ధరణి తీసేస్తే.. భూములు బీడే...




**రికార్డులన్నీ అస్తవ్యస్తం**

**కాంగ్రెస్ తీరుపై రైతన్న ఆగ్రహం**

**రైతుల భూములకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ధరణి పోర్టల్ తో భూములపై రైతులకు సర్వహక్కులు సమకూరాయి. అలాంటిది కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్ ను రద్దు చేస్తామని ఆ పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి పాలనలో కాంగ్రెస్ హయాంలో పటేల్, పట్వారీ వ్యవస్థతో పడిన కష్టాలు చాలని, మళ్లీ అలాంటి ఇబ్బందులు పడలేమని పేర్కొంటున్నారు. భూ రికార్డుల తప్పిదాలతో నిత్యం కొట్లాటలు, కేసులతో పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరిగి అలిసిపోయామని, మళ్లీ కాంగ్రెస్ వస్తే ఎనుకటి రోజుల మాదిరి ఆ బాధలు పడలేమని చెప్తున్నారు. ధరణి పోర్టల్ తో భద్రంగా ఉన్న భూములను మాయం చేయాలని చూసే కాంగ్రెసోళ్లకు ఓటుతోనే బుద్ధి చెప్తామని హెచ్చరిస్తున్నారు.**



### ధరణితో ధైర్యంగా ఉన్నాం

గత కాంగ్రెస్ పాలనలో భూములకు భద్రత లేక పోయేది. పట్వారీలు ఒకరి భూమిని మరొకరికి పట్టా చేసేటోళ్లు. గుంట భూమికైనా ఎంతో విలువ పెరిగిందిప్పుడు. అలాంటిది ఎకరాల కొద్ది భూమిని లంచాలు తీసుకుని తారుమారు చేసేటోళ్లు, డబ్బులున్నోళ్లు అన్యాయంగా పేదోళ్ల భూములను ఆక్రమించే అవకాశం ఉండె. గ్రామాల్లో, అల్లర్లు, పంచాయితీలు ఎక్కువయ్యే ప్రమాద ఉన్నది. కానీ.. ఆ సమస్యలు లేకుండా సీఎం కేసీఆర్ ధరణిని తీసుకొచ్చి మంచి పని చేసిండు. ఇప్పుడు తాసీల్దార్ ఆఫీసులనే నిమిషాల్లో రిజిస్ట్రేషన్ అయితుంది. హక్కుదారు వేలి ముద్ర లేనిదే భూమి మారదు. ఇప్పుడు ధైర్యంగా ఉన్నాం. గుండెల మీద చెయ్యి వేసుకుని నిద్రపోతున్నాం. ఇదంతా బీఆర్ఎస్ ప్రభుత్వం చలువే. కాంగ్రెస్ మాయ మాటలు చెప్పి అధికారంలోకి రావాలని చూస్తున్నది.

– వీరపనేని రామారావు, కల్లూరు, నేరేడుచర్ల మండలం

### ధరణి తీసేస్తే అధికారుల చుట్టూ తిరగాల్సిందే..



కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ధరణిని తీసేసి భూ మాతను తెస్తారంట. మాకు ధరణినే బాగుంది. ధరణి తీసేస్తే మళ్లీ అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తుందేమో. అధికారులకు అమ్యామ్యాలు ముట్టజెపాల్సి వస్తది. ధరణితో ఒక్క అధికారికి కూడా పైసలు ఇవ్వకుండా రైతుల ఇబ్బందులు తొలగిపోయాయి. కర్ణాటకలో రైతుల ఇబ్బందులను టీవీల్లో, పేపర్లలో చూస్తునే ఉన్నాం. దళారుల రాజ్యం తెచ్చేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే రావాలి. మతిభ్రమించి మాట్లాడుతున్న కాంగ్రెస్‌కు ఓటమి తప్పదు.

– మేకల గంగరాజు, నడిగూడెం

### రైతుల బాగు చూడలేకే ధరణి తీసేస్తామంటున్నరు



రైతులు బాగు పడడం కాంగ్రెస్ వాళ్లకు ఇష్టం లేదు. అందుకే రైతులకు మంచి చేస్తున్న ధరణి తీసేస్తమంటున్నరు. ధరణి తీసేస్తే రైతుల భూములు మళ్లీ పెత్తందారుల చేతిలోకి వస్తయ్. గతంల కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతుల సమస్యలు పట్టించుకోలేదు. తెలంగాణ రాక ముందు భూములు అమ్మాలన్నా, కొనాలన్నా దళారులను ఆశ్రయించాల్సి వచ్చేది. వాళ్లు వేల రూపాయలు తీసుకొనేటోళ్లు. ఆ తర్వాత రికార్డుల్లో మార్చేందుకు కూడా నెలల తరబడి ఆఫీసు చుట్టూ తిరిగేది. ఇప్పుడు ధరణితో తాసీల్దార్ కార్యాలయంలోనే అరగంటలోనే భూములను రిజిస్ట్రేషన్ చేసి పేపర్లు చేతిలో పెడుతున్నారు. మ్యుటేషన్ సైతం వెంటనే అవుతుంది. ఒక్క రోజులోనే పాస్ బుక్కు కూడా వస్తుంది. ధరణి రావడంతోనే రైతుల కష్టాలు పోయినై. ధరణి తెచ్చిన బీఆర్ఎస్‌కే ఓటేస్తం.

– షేక్ శంకర్, రైతు, ముదిమాణిక్యం, అడవిదేవులపల్లి మండలం

### కాంగ్రెస్ వాళ్లను నమ్మితే భూములు అమ్ముకోవాల్సిందే



కాంగ్రెస్ వాళ్లను నమ్మితే రాబోయే రోజుల్లో కొద్దిపాటి భూములను అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ చాలా మంచిగున్నది. దాంతో నిమిషాల్లోనే భూమి రిజిస్ట్రేషన్ అవుతుంది. తిరగాల్సిన అవసరం లేకుండా వారం రోజుల్లో ఇంటికే పోస్టు ద్వారా పట్టాదారు పాస్ పుస్తకం వస్తుంది. మన భూమి అమ్మాలంటే మన వేలి ముద్ర అవసరం. ఎంత గొప్ప అధికారులైనా ఏం చేయలేరు. ఏ అధికారికీ లంచం ఇవ్వాల్సిన అవసరం లేకుండా రిజిస్ట్రేషన్ అయితది. కాంగ్రెస్ వచ్చేది లేదు సచ్చేది లేదు. గానీ.. ధరణిని రద్దు చేస్తామంటున్నది. అలా చేస్తే మళీ దళారులు, బ్రోకర్లు, అవినీతి రాజ్యం మొదలయితది. రైతులు ప్రభుత్వ కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరగాల్సి వస్తది. ఇప్పటి దాకా కాంగ్రెస్‌తో పడ్డ బాధలు చాలు. రైతులకు ఇంత మంచిగా మేలు చేస్తున్న ధరణి కోసమైనా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు తగిన బుద్ధి చెప్పాలి.

– తీగుళ్ల యాదగిరి, ఫణిగిరి, నాగారం మండలం

### ధరణి పోతే మళ్లీ కష్టాల బతుకులే



ధరణి వచ్చినంకనే రైతుల జీవితాలు కుదుటపడ్డయ్. మా భూములకు ఏం ఢోకా లేదని ధైర్యంగా ఉంటున్నం. సీఎం కేసీఆర్ రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కష్టాలను తీర్చేందుకు ధరణి పోర్టల్ తీసుకొచ్చినరు. వ్యవసాయ భూముల వివరాలు ఒకే చోట పొందుపర్చి అన్నీ ఆన్‌లైన్‌లో పెట్టినరు. దాంతో రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే కష్టాలు పోయాయి. రైతులు వచ్చి వేలిముద్ర వేస్తేగాని భూమి పట్టా మార్పిడి జరుగదు. ధరణి ద్వారానే రైతుబంధు డబ్బులు పక్కాగా మా ఖాతాలో పడుతున్నయి. అదే కాంగ్రెస్ హయాంలో అన్ని అవకతవకలే. భూముల రికార్డులు సరిగా లేక ఎవరిష్టం వచ్చినట్లు వాళ్లు రాయించుకున్నరు. దాంతో నిత్యం భూ పంచాయితీలే అయ్యేవి. ఇప్పుడు ధరణి పోతే మళ్లీ అలాంటి కష్టాలే వస్తయ్. అలాంటి కాంగ్రెస్ పాలన మాకొద్దు.. సీఎం కేసీఆర్ పాలనే మళ్లీ కావాలి.

– గంట వెంకట్‌రెడ్డి, జువ్విగూడెం, నార్కట్‌పల్లి

### ధరణి పోర్టల్‌కు వేరేది సాటిరాదు



గతంలో భూముల విషయంతో అధికారులు నానా ఇబ్బందులు పెట్టినరు. ఒకరి భూమి ఇంకొకరికి రాయడంతో మళ్లీ వాళ్ల చుట్టూ తిరగాల్సి వచ్చింది. సీఎం కేసీఆర్ సార్ తీసుకొచ్చిన ధరణితో మా ఇబ్బందులు తీరినై. ధరణి వచ్చినంకనే నాలాంటి పేద రైతులు గుండెమీద చెయ్యి వేసుకొని నిర్భయంగా ఉంటున్నం. మా భూముల వివరాలు ఆన్‌లైన్‌లోనే ఉండడంతో ఎప్పుడు పడితే అప్పుడు చెక్ చేసుకోవచ్చు. గతంల మా పొలం మా పేరుతోనే ఉందా లేదా అని ఎప్పుడూ రికార్డులు చూడాలని ఆఫీసుల చుట్టూ తిరిగేటోళ్లం. బాగా పలుకుబడి ఉన్నోళ్లు అధికార్లతో కుమ్మక్కై రికార్డుల్లో భూములను తారుమారు చేసేటోళ్లు. భూములు అమ్మాలన్నా.. కొనాలన్నా ఇబ్బందిగానే ఉండేది. ఇప్పుడు ధరణితో రైతుల భూములు మారి పేరుతోనే ఉంటున్నయ్. మేము వేలిముద్ర వేయకుండా ఎవ్వరూ దానిని మార్చే పరిస్థితి లేదు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ధరణిని తీసేస్తామంటున్నరు. ధరణి తీసేస్తే రైతులకు మళ్లీ కష్టాలే. రైతుకు సీఎం కేసీఆర్ అన్ని విధాల మంచి చేస్తుండు. మళ్లీ ఆయనకే మద్దతిస్తాం.

–పగిడి కొండలు, రైతు, దామరచర్ల

### ధరణి తీసేస్తే మునుపటి రోజులు వస్తయ్



సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణి పోర్టల్ వల్ల భూ సమస్యలు లేవు. గతంలో భూముల పట్టాల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఒకే భూమిని ఇద్దరుచ, ముగ్గురి పేరు మీదికి మార్చేటోళ్లు. దాంతో ఊర్లలో తీవ్రమైన గందరగోల పరిస్థితులు ఉండేవి. ధరణి వచ్చినంకనే ఈ పరిస్థితి లేకుండా పోయింది. ఎవరి భూమి వారి పేరునే ఉండేలా చేశారు. ధరణితోనే ప్రతి రైతుకు సరిగా రైతుబంధు డబ్బులు అందుతున్నాయి. ఇప్పుడు ధరణిని ఎత్తివేస్తామని కాంగ్రెస్ పార్టీ వాళ్లు చెప్పడం వారి అవివేకం. ధరణి తీసేస్తే మళ్లీ పాత రోజులు వస్తాయి. భూముల సర్వే నంబర్లు మారుతయ్. మళ్లీ మధ్య దళారులు వస్తరు. కౌలుదారు చట్టం తెస్తే భూయజమానులకు, కౌలుదారులకు నిత్యం గొడవలే. ఏదేదో చెప్పి రైతులను మోసం చేయాలని చూసే కాంగ్రెస్‌ను రైతులు నమ్మే పరిస్థితి లేదు. రైతుల కోసం పనిచేస్తున్న సీఎం కేసీఆర్ మళ్లీ రావాలని కోరుకుంటున్నాం.

–కర్ర రుక్మారెడ్డి, రైతు, బొప్పారం, కేతేపల్లి మండలం